**కథ**

# వెన్నెల

ఆకాశం కేసి చూస్తోంది హేమ. 'పిండారబోసిన పండువెన్నెల' మల్లె తోట విరబూసినట్లుంది. అంతా ఆదమరచి నిద్రిస్తున్నారు. బైట కుక్కలరుస్తున్నాయి. ఎదురింట్లో పసిపిల్లాడు 'కేర్'మన్నాడు. ఉలికిపడి లేచిన తల్లి ఊయలూపుతోంది..

పున్నమి వెలుతుల్లో బైటపడుకున్న వెంకటమ్మ 'ఛేయ్' 'ఛేయ' కుక్కల్ని అదిలిస్తూ బిడ్డపై చెయ్యేసింది. తల్లి బిడ్డల్ని ఎంత తపనపడి పెంచుతుందో?! ఇలాంటి సమయంలో..వెన్నెల కాగితాలు ముందేసుకుని కూర్చునుంటుంది తనలోని కవిని నిద్రలేపుతూ..కవి, కన్నతల్లీ ఒక్కటే. వెన్నెలకు ఎంత తపన? తపనలేంది తాపసి ఎలా కాగలదు? నిద్రపట్టని హేమ వెన్నెల గురించిన దీర్ఘాలోచనలో మునిగింది.

★ ★ ★

మనుష్యుల మనస్తత్వాలు రెండురకాలు. మొదటిరకం 'లౌక్యం' పేరుతో అవతలివారి అభిప్రాయాలకు 'డిటో', 'డిటో' చెబుతూ..తల్లో నాలుకౌతారు. ఇక రెండోరకం, అవతలివారి అభిప్రాయాలు విని, తమ అభిప్రాయాలను కుండ బద్దలుకొట్టినట్లు చెబుతూ..చాలామందికి నచ్చనివారౌతుంటారు. అతి కొద్దిమందికి సన్నిహితులౌతారు. ఈ రెండోరకంవాళ్ళని చూడగానే, చెవులు కొరుక్కుంటూ...గంటల తరబడి కాలక్షేపం చేసేవాళ్ళంతా..చల్లగా జారుకుంటుంటారు. రెండో రకానికి చెందింది వెన్నెల. అనుకున్నది చేసే మనస్తత్వం ఆమెది. అందులో ఎన్ని కష్టాలెదురైనా, ఎవర్నీ ఖాతరు చెయ్యదు. ఈ వ్యక్తిత్వమే వెన్నెలను ప్రత్యేకమైన వ్యక్తిగా నిలబెట్టింది!



★ ★ ★

అందుకే..తనంటే నాకిష్టం. తన రచనలిష్టం. పత్రికల్లో..తనవి ఎన్నో రచనలు వచ్చాయి. కొందరు మెచ్చుకుంటూ, మరికొందరు విమర్శిస్తూ, ఇంకొందరు వీరాభిమానం ప్రకటిస్తూ..లెటర్స్ రాస్తుండేవారు. ఎలాంటి లెటరొచ్చినా ''తిరగలి బొడ్డు దగ్గరున్న ధాన్యంలా' చెదరకుండా చదివేది. అసలు, 'నాకూ..తనకూ స్నేహం ఎలా కుదిరిందబ్బా!' అని అందరూ బుర్రలు బద్దలుకొట్టుకునేవారు!

★ ★ ★

నలుగురు పోగైనచోట నవ్వులు కురిపించేది వెన్నెల. అలాగని చాలామంది స్నేహితులు లేరామెకు. కాసేపు నవ్వించినా..ఉన్నమాట ముఖాన కొట్టినట్లు చెప్పడంచేత ఆమెకు అందరూ పరిచితులే అయ్యారుకాని స్నేహితులు కాలేకపోయారు.

ఎంత పొగరు, డబ్బుందని అహంకారం? ఇలాంటి మాటలు ఆమె పరోక్షంలో చెప్పుకోవడమూ కద్దు. తన రచనలు చదివి అభిమానినైన నేను, పరోక్షంలో అనుకునే విషయాలు చెప్పేదాన్ని!

'అల'లా నవ్వేది. విస్సుబోతుండేదాన్ని! అలా మాట్లాడుకుంటారని తెలుసునంది.

తెలిసి కూడా...

అవును, వాళ్ళేదో, నా చాటుగా అనుకుంటారని ఎదురుగా ఉన్నప్పుడు నాకొచ్చిన అభిప్రాయం చెప్పకుండా వుండలేను హేమా! ఏమిటో! అలా ఉండాలని మొదట్లో ప్రయత్నించాను. లోకులేమనుకున్నా నా తీరే అంత. 'కడుపులోకొచ్చింది కక్కిందాకా' నిద్రపట్టదు మరి. భిన్నధృవాలైన మేమిద్దరం కలవడమే విచిత్రం. మా స్నేహం అందరికీ ఓ క్వశ్చన్‌మార్క్!

★ ★ ★

తాను చూసిన బంగారు లేడిని ఎన్నోరకాలుగా శ్రీరామచంద్రుడికి వర్ణించి చెబుతూ, చివరకు ఎంత అందంగా ఉందో తెలియాలంటే 'ఆ లేడి చూడవలె నదియంతె' అంటుంది విశ్వనాథవారి సీత. అలాగే, వెన్నెల గురించి నేనెంత వర్ణించినా తక్కువే. ఆమెను మీరు చూస్తే తప్ప, ఎంత అందమైందో అర్థంకాదు. వెన్నెల నిజంగా వెన్నెలే! నేనో? కనీసం ఫోటోలో కూడా బావుండను. శరీరానికంత ఇంపార్టెన్స్ ఇవ్వవద్దనేది. 'మనసు గురించి ఆలోచించు. మనసు మంచి గంధంలా వుండాలి. అదిలేని నువ్వెంత అందంగా ఉన్నా..నీ స్నేహాన్ని ఆమోదించేదాన్ని కాదు' అంటుండేది వెన్నెల. ఇది కూడా ఓ పాయింట్ మా స్నేహం పెరగడానికి. నేను చూడ్డానికి బావోకున్నా, మనసు బంగారమని అమ్మేకాదు, అత్తమ్మా అంటుండేది. ప్రసాదు బావైతే 'ఔనౌను! బంగారు చంద్రహారం చేయించాలి' పరిహాసాలాడేవాడు. మాఘమాసంలో నా పెళ్ళి ముహూర్తాలు పెట్టుకున్నారు.

★ ★ ★

హేమ 'శ్రీమతి హేమ' అయింది. వెన్నెల నాన్నగారు పెళ్ళి ప్రయత్నాల్లో పడ్డారట. ఒక్కటీ కుదర్లేదు. వచ్చిన వాళ్ళు నచ్చనిప్రశ్న వేయగానే, ఫెడేల్‌మని సమాధానాలు చెప్పేదట వెన్నెల. మూడుముళ్ళు వేయకమునుపే ఇలా...ఇహ, పెళ్ళి చేసుకుంటే, ముప్పై ఏళ్ళకే బట్టతల రావడం ఖాయమని పెళ్ళిచూపుల కొచ్చిన కుర్రాళ్లు పరుగుతీశారట!

★ ★ ★

నేను కాపురానికెళ్ళాక మా అత్తగారికి పక్షవాతం రావడం, మంచాన పడటం, పెద్దకోడలిని కావడం మూలాన బాధ్యత నాపైన పడడం జరిగాయి. ఇదుగో, కరెక్ట్‌గా సంవత్సరానికి నా నేస్తాన్ని కలిసి, కామెడీ సీన్‌లా అది చెప్పేమాటల్ని వింటూ ఆశ్చర్యంలో మునిగిపోయాను తన పద్ధతికి. నెల్లాళ్ళు ఉండిరమ్మని అత్తమ్మ, బావ పర్మిషన్ ఇచ్చారు. ఇంకేం! పుస్తకాల్లో నెమలికన్ను పెంచుకున్న రోజుల్లోకి వెళ్ళిపోయాము మేమిద్దరం!

★ ★ ★

వెన్నెల రాసిన కథొకటి అచ్చయింది. పత్రిక తీసుకుని చదువుతున్నాను. అప్పుడే 'పోస్ట్' వచ్చింది. లెటర్సన్నింటినీ వెన్నెల చదవసాగింది. ఉత్తరాలన్నింటిలోకి ప్రత్యేకంగా ఓ పింక్ కలర్ కవర్ కనిపించింది. కవర్‌పైన 'బై ఎయిర్ మెయిల్' ప్రింట్ ఉంది!

వెన్నెలా..వెన్నెలా ఇది చదవ్వా!

లెటర్ ఓపెన్ చేసింది. ''వెన్నెలగారికి నమస్కారం! మీ రచన చదవడం ఇదే మొదటిసారి. ఏడు సంవత్సరాల క్రితం నేను ఈ పత్రిక పాఠకుణ్ణి. ఏడేళ్ళనుండి బిజినెస్

పనిపై సౌదీ అరేబియాలో ఉంటున్నాను. మొదటిసారి ఈ పత్రిక ఇక్కడ చూడ్డం. ఇక విషయానికొస్తే..మీ కథ అద్భుతం. 'సౌదీ'లో అన్నీ సెటిల్ చేసుకుని అతి త్వరలో ఆంధ్రాకు వస్తున్నాను. ఎంత త్వరలో అంటే కేవలం ఒక వారంలో. రాగానే మిమ్మల్ని కలుస్తాను. ఫోటోలో మీరు ఎంత అందంగా..గొంతు నొక్కేసినట్లు ఆగింది. లెటర్ నాకిచ్చింది. లెటర్‌నిండా అంగాంగ వర్ణనలు. ఎవడో, రోగ్! అభిమానినంటూ చాలా అసహ్యంగా రాశాడు.

''పర్వర్టెడ్ ఫెలో..ఛీ..ఛీ..'' వెన్నెల మొదటిసారి ఇలాంటి లెటర్ అందుకోవడం. ఫంక్ అయినట్లుంది. తేరిపార చూశాను. పసుపుపచ్చ ఓణీ కట్టుకున్న నందివర్ధనంలా ఉంది. తననెలాగైనా డైవర్ట్ చేయాలని ''ఏయ్! అటు చూడు. నేనన్న ధోరణికి తల తిప్పింది.

''కోడి తులసి ఆకుల్ని తింటోంది''

''కాదులే, ఏవో పురుగులుండుంటాయి'' జవాబిచ్చింది''

''ఏంకాదు! తులసి ఆకులు ఆరోగ్యానికి మంచివని తింటోంది''

''ఏడ్చావులే!'' కిలకిలలాడింది! అప్పటికలా. చిన్న గండం గడిచినట్లైంది.

★ ★ ★

ఓరోజు నాకు కబురుపెట్టింది. 'అదే పింక్ కలర్ కవర్' నాకిచ్చింది. ఈసారి దాన్నిండా నీలిరాతలు. పైపెచ్చు అడ్రస్ కూడా రాశాడు.

'రిప్లై' రాయాలట. ఆంధ్రాకు తగలడి రెండ్రోజులైందట. ఎవడీ రోగ్! తల్లీ, చెల్లీ లేరా వీడికి! అసలు తల్లికి పుట్టుంటేగా! ఖచ్చితంగా టెస్ట్ ట్యూబ్ బేబీ అయ్యుంటాడు. నేనన్న ఫోర్స్‌కు, మబ్బువీడింది తన ముఖంలో.

★ ★ ★

అప్పటికి ప్రశాంతంగా కనిపించినా, చాలా డిస్టర్బ్ అయింది ఈ పింక్ కలర్ కవర్స్‌వల్ల. ఏ లెటరొచ్చినా, రాకున్నా- ఇవి రంచనుగా రావడం, చదివి మూడ్ ఆఫ్ కావడం మామూలైంది. ఆరునెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారట. ఎప్పుడూ- గోవుకళ్ళతో లోకాన్ని చూసే నేను వీడికి తగిన బుద్ధి చెప్పాల్సిందేనని నిర్ణయించుకున్నాను.

★ ★ ★

నాకు తెలిసిన కుర్రాణ్ణి అడ్రస్ ప్రకారం ఆ ఊరు పంపించాను. అసలలాంటి పేరున్న వ్యక్తి ఆ ఛాయల్లోనే లేడట. పోస్టాఫీస్‌లో కూడా ఎంక్వయిరీ చేసి తిరిగొచ్చాడు. పింక్ కలర్ కవర్‌గాడు పిరికిపందన్నమాట. పరిష్కారం?!

★ ★ ★

సడన్‌గా-పింక్ కలర్ కవర్స్ స్టాపయ్యాయి. ఏం జరిగిందో మీకూ తెలియాలిగా!

''వెన్నెలా..కొత్తగా ఏం రాశావు?''

''గమ్యం- హేమా!''

''అయితే ఓ పజ్జెయ్''

''అలాగే''

అంతే, అప్పటినుండి పింక్ కలర్ మంకీ పలకరిస్తే ఒట్టు!

★ ★ ★



ఇంతకీ ఏం జరిగిందంటే..

'గమ్యం' సీరియల్ ప్రారంభంలో రచయిత్రి వివరాల్లో, వెన్నెల ఫోటోతోపాటు, 'శ్రీమతి వెన్నెల, వైఫాఫ్ గిరి, ఎస్.పి.' అని వేయించాము. ఎస్.పి.గారి దెబ్బకు లెటర్స్ మానేశాడు 'వింత మృగం'!

వాడి సంగతికేంగానీ, ఇంట్లో ఇది తెల్సింది. ''ఆడపిల్ల జీవితం ముళ్ళకంపలో చిక్కుకున్న పట్టుబట్టలాంటిది. పెళ్ళికాని పిల్ల ఇలా వేయించ్చా!'' నానా హంగామా జరిగింది.

వెన్నెల నాన్నగారు తన క్వాలిఫికేషన్స్ పెళ్ళిపందిరి ప్రకటనకివ్వడం, దైవవశాత్తూ ఎస్.పి భర్తగా దొరకడం, కాకపోతే గిరి బదులు పెళ్ళికొడుకు హరి కావడం సంభవించాయి నాటకీయంగా.

★ ★ ★

పెళ్ళిచూపుల్లోనే జరిగిన విషయం చెప్పింది వెన్నెల. ఇదే ప్లస్ పాయింటయింది. తన ఫ్రాంక్‌నెస్ నచ్చి సదరు హరిగారు సంబంధం ఖాయం చేసుకున్నారు. పింక్ కలర్ కవర్‌గాడి పుణ్యమా అని వెన్నెల ఇంటిగుమ్మానికి మామిడి తోరణాలు కట్టబడ్డాయి.

★ ★ ★

మనిషిని పోలిన మనుషులు లోకంలో ఏడుగురుంటారని ప్రతీతి. మరి, స్వభావాల్లో ఎందరుంటారో? జాబిలిని రెండు సగాలు చేస్తే ఎలాగో..అలావుంటారు వెన్నెల, హరి. పెళ్ళికాగానే పింక్ కలర్ లెటర్లన్నీ చూపించిందట. ''బుద్ధి చెపుతూ కథ రాయవోయ్!'' వీపు తట్టి ప్రోత్సహించారట శ్రీవారు. కాకపోతే కథ రాసే పని హనీమూన్‌లో పెట్టుకోకని బుంగమూతి పెట్టారట.

★ ★ ★

హరిగారు సున్నిత హాస్యప్రియులట. ఇది-వాళ్ళమ్మ గుర్తొచ్చి ఏడుస్తుంటే పనిమనిషిని పిలిచి, ''అమ్మగారి చేత ఉల్లిపాయలు తరిగించకు. చూడు, ఎలా ఏడుస్తుందో? ఈసారి అమ్మగారు ఉల్లిపాయలు తరగడం నే చూశానో నిన్ను డిస్మిస్ చేస్తాను'' అన్నార్ట. అప్పటినుండీ ఎప్పుడు వెన్నెల అమ్మకోసం ఏడ్చినా పనిమనిషి ''అమ్మగారూ అమ్మగారూ.. ఏడవమాకండి. అయ్యగారికి తెలిస్తే నన్ను ఆ..అదేంటి! 'కిస్‌మిస్' చేస్తారు! నవ్వండమ్మా'' అని ఒకటే బ్రతిమిలాడ్డం!

★ ★ ★

నెల పర్మిషన్ పూర్తయ్యి అత్తారింటికెళ్ళిన నాకు, అత్తారింటినుండి వెన్నెల రోజూ ఫోన్ చేసి ఈ సంగతులన్నీ చెప్పి నవ్విస్తోంది. నేనూ..తనూ..అలా..అలా..నిమిషాలు, నిమిషాలు ఫోన్ తీగలపై దొర్లిస్తూ..నవ్వేస్తూ కాలం గడుపుతుంటాం.

★

**యశశ్రీ రంగనాయకి**